# షాక్...షాక్

– ఎం. చంద్రిక



'నాలుగు రోజుల నుంచి సుందరి మార్నింగ్ వాక్‌లో కనపడడంలేదేమిటి?' అని పదోసారి అనుకుంది కవిత పేపర్ చూస్తూ. 'వారం నుంచి చూస్తున్నాను సుందరి రాలేదు. మార్నింగ్ వాక్‌కి అని ఉదయమే సుప్రభాతం మొదలు పెడుతున్నావు. ఒకసారి వెళ్ళి చూసి రావచ్చు కదా!' అని శ్రీవారి ఉవాచ. 'సుందరి ఆంటీ రాకపోతే నీకు దిగులు ఎందుకు మమ్మీ' పుత్రరత్నం కామెంట్. 'మన ఇంటివైపు రావటంలేదు. అబ్బాయి చెప్పినట్లుగా చూసిరా వచ్చు కదా! నువ్వు అసలు కదలవు' అత్తగారి దీర్ఘం.

సాయంత్రం నాలుగు గంటలకి సుందరి ఇంటికి బయలుదేరింది కవిత. ఎప్పుడూ 'హెల్త్ బాలేదు. మార్నింగ్ వాక్ చెయ్యమన్నాడు. డాక్టరు' అంటూ అనుమానపడుతూ ఉంటుంది. వయసు మరీ ఎక్కువ ఏమీ కాదు 30–35 మధ్య ఉండవచ్చు. కాని కాస్త వళ్ళుగానే ఉంటుంది. భర్త బ్యాంక్ మేనేజర్. నాకు మార్నింగ్ వాక్‌లో పరిచయం. మూడేళ్ళుగా అది స్నేహంగా మారింది. ఇద్దరిదీ ఇంచుమించు ఒకే ఏజ్. 'ఇంటి పని అంతా చేస్తావు. అయినా నువ్వు ఇంతస్లిమ్‌గా ఉంటావ్. ఇంకా నీకు మార్నింగ్ వాక్ ఎందుకే బాబూ' అంటుంది సుందరి. నవ్వుతూ గలగల మాట్లాడే సుందరి రాకపోవటం నాకు నిరుత్సాహంగా ఉంది.

ఆలోచనలతో సుందరి ఇంటిదగ్గరకి వచ్చేశాను. గేటు తియ్యగానే ఎప్పుడు పిచ్చి మొక్కలతో వాకిలి గడిబిడిగా ఉండేది. ఇప్పుడు పిచ్చిమొక్కలు అన్నీ పీకేసి నేలంత చదునుచేసి రకరకాల మొక్కలులైన్లు లైన్లుగా, గార్డెనులా తయారుచేసి ఉంచారు.

ఏమయినా ఫంక్షన్ ఉందేమో! అందుకనే రావటంలేదు అనుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టాను. ఎప్పుడు స్టీరియో సౌండ్‌తో సాంగ్స్, టీవీలో వచ్చే ఛానల్స్‌తో గందరగోళంగా కూలర్ సౌండ్‌తో, హోరెత్తిపోతూ, ఉండేది.

అన్నీ ఆశ్చర్యాలే! టీవీ 'అమ్మయ్య నాకు రెస్టు' అనుకుంటూ కవర్‌తో సహా వేసుకుని కూర్చుంది. ఈ నిశ్శబ్దంలో మామ్మగారి రామదాసు కీర్తనలు సన్నగా వినిపిస్తున్నాయి. 'ఏమిటి మామ్మగారూ కొత్తగా కీర్తనలు పాడుతున్నారు' అంటూ, 'ఇంట్లో ఎవరూలేరా మామ్మగారూ' అన్నాను. 'ఎందుకులేమ్మా, ఇంట్లోకిరా. ఆమె ఎప్పుడు పాడే కీర్తనలే! మా స్టీరియో హోరు, టీవీ గోలతో మా పిల్లల అల్లరితో నీకు ఎప్పుడు వినపడలేదులే!' అంటూ పిండి రుబ్బే చేత్తో వచ్చిన మా సుందరిని చూసి ఆశ్చర్యపోయాను. ఎప్పుడు చేత్తో రిమోట్‌తో, సోఫాలో కూర్చుని ఆపసోపాలు పడే సుందరి పప్పురుబ్బటం ఏమిటీ? అనుకుంటూ నోరు తెరుచుకొని చూస్తున్నాను నేను. చేతులు కడుక్కొని మూలనున్న కూజాలోని చల్లని నీళ్ళు ఇచ్చింది సుందరి. 'ఏమిటే కవితా అలాషాక్ తిన్నట్లుగా అయిపోయావు. సుందరి ఏమిటీ కూజానీళ్ళు తాగటం ఏమిటీ అనుకుంటున్నావా? ఫ్రిజ్ వాటర్ తప్ప ముట్టుకోదు, కుండ నీళ్ళు తాగుతుందీ అని అనుకుంటున్నావా? ఇది అంతా పవర్ మహాత్మ్యమే తల్లీ? ఎన్ని మహాత్మ్యాలో అన్నీ చెయ్యగలదు.'

'అవును కవితా! ఇది నిజం. కరెంటు ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవటంతో, మావారు అన్నింటికి పవరు కట్ చేసారు. రోజు ఇంట్లో ఉపన్యాసాలు కరెంటు ఎలా ఆదా చెయ్యాలి. ఎంత పొదుపుగా వాడాలి అని. 'ముందు మోటారు వెయ్యటం మానేశాం. ఉదయం పిల్లలు, సాయంకాలం నేను నీళ్ళు పడుతున్నాం. గీజర్ ప్లగ్ పీకేసాం. అందరు చన్నీళ్ళ స్నానం, మామ్మగారికి మాత్రం గ్యాస్ మీద పెట్టిస్తున్నాను. మిక్సీని పొడులకు మాత్రమే ఉపయోగిస్తున్నాను. అర్జెంటు అయితేనే మిక్సీలో చట్నీ చేస్తున్నాను. స్టోరు రూములోంచి రోలు తీశాను. గ్రైండర్ వాడటం పూర్తిగా మానేశాను. క్లీనర్‌ని ఉపయోగించటం మానేసి చీపురుకి పనిచెప్పాను. వారానికి ఒకసారి మార్కెట్‌కి వెళ్ళి, కాయగూరలు, పండ్లు, తెచ్చి ఫ్రిజ్ నింపటంమానేసి, ఫ్రిజ్ వాడకం తగ్గించాను. వీధిలో వచ్చే కాయగూరలు ఇంటిముందు ఏ రోజుకారోజు కొంటున్నాను. ముఖ్యమైన కార్యక్రమాలు తప్పించి టి.వి. చూడటమేమానేశాను. ఒకటి అనేమిటి? కరెంటుతో ఉపయోగించే అన్ని వస్తువుల వాడకం తగ్గించాము. ఇదీ అంతా కరెంటు మహాత్మ్యమే కవితా!

'అస్తమానం ఏసీలు, కూలర్ల గాలే స్వచ్ఛమైన గాలి అనుకునేదాన్ని. కింద పెరడు అంతా బాగు చేసి, చిన్న గార్డెన్‌లా తయారు చేశాను. పచ్చదనం, పరిశుభ్రతకోసం తోటపని మొదలెట్టాను. అదో ఎక్సర్‌సైజులా ఉంది. ఇన్నాళ్ళూ నిన్ను చూసి అన్నీ ఉన్నా నీకు ఉపయోగించటం తెలీదు అనుకునే దాన్ని. కొత్తలో ఎలా ఇన్ని పనులు చెయ్యటం, అని బెంగ, ఇప్పుడు అన్నిపనులు ఆటోమాటిక్‌గా అలవాటుగా అయ్యాయి. అన్ని పనులు కరంటు వస్తువులతో త్వరగా చేసి, టైమ్‌పాస్ అవక టీవితో కాలక్షేపం చేసే దాన్ని, ఇప్పుడు అలా కాదు.

టీవీలో వార్తలు చూస్తున్నాను కదా! ఇంక పేపరు ఎందుకు చదవటం అనుకునేదాన్ని, ఇప్పుడు టీవీ అస్తమానం పెట్టాలి అంటే భయం. కరెంటు ఎన్ని యూనిట్లు కాలిపోతుందో అని. పని అంతా అయ్యాక గంటసేపు పేపరు చూస్తున్నాను. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషను, గ్రైండర్లు జాబ్ చేసేవాళ్ళకి బాగా ఉపయోగిస్తాయి. వాళ్ళకి, కరెంటు వస్తువుల వాడకం వల్ల టైమ్ బాగా కలిసివస్తుంది. సమయానికి ఆఫీసుకి వెళ్ళాలి అంటే ఇవి అన్నీ తప్పనిసరి. అలా అని అందరికీ అవసరం లేదా అంటావేమో! అందరికీ ఉపయోగించేవే! కాని మనలాంటి ఇంటిపట్టునుండే గృహిణులు అన్ని పనులకి వాటిమీద ఆధారపడకుండా ఉంటే ప్రస్తుతపరిస్థితులలో కరెంటు ఎకానమీ చేసుకోగలం. అవసరానికి మాత్రం తప్పకుండా ఉపయోగించాలి. పూర్తిగా వాటిమీద ఆధారపడకుండా!" అంది సుందరి.

'అమ్మయ్య అయిందా నీ ఉపన్యాసం. భలే పనిచేశావు సుందరీ. అయితే మార్నింగ్ వాక్ బంద్ అన్న మాట నీకు' అన్నాను. 'వస్తానే కవితా! ఇన్నిరోజులు నిద్రపట్టేదికాదు. రాత్రి పన్నెండు వరకూ టీవీ చూసి. ఇప్పుడు ఈ పనులన్నీ చేసేసరికి శరీరం అలసిపోయి త్వరగా నిద్రవస్తోంది. అలవాటు అయిన పనే కదా! 'నువ్వు స్లిమ్‌గా ఎలా ఉన్నావో ఇప్పుడు తెలిసింది' అంది. మాటల్లో సుందరి ఆయాసం, నీరసం అన్న పదాలే మర్చిపోయింది.

'ఔరా! పవర్ (కరెంట్) నీకు ఇంతటి మహాత్మ్యం ఉందా. అందుకే ముట్టుకుంటే షాక్ కొడుతున్నావు. నీకు మా జోహార్లు' అనుకుంది కవిత. ●